## మంచి వార్త

# యువతకు అండగా గ్రామ పంచాయతి



**గ్రామ** పంచాయతి విధులంటే గ్రామీణ రోడ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం కల్పించడం, తాగునీరు, మురుగు నీరు– వ్యర్థాల నిర్వహణ లాంటివి ఉంటాయి. పంజాబ్ రాష్ట్రం పాటియాలా జిల్లాలోని అక్రి గ్రామ పంచాయతి మాత్రం ఆ ఊరి పిల్లలు విద్య, ఉద్యోగాల్లో రాణించడం కూడా తన బాధ్యతగా తీసుకున్నది. 800 జనాభా ఉన్న ఆ ఊళ్లో ఓటర్ల సంఖ్య 562. ఇటీవల కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతి సర్పంచ్, సభ్యులు తమ గ్రామ ప్రజల సమక్షంలో కొన్ని కొత్త నిర్ణయాలను తీసుకున్నారు. ఇక్కడ సర్పంచ్, సభ్యుల వయసు 40 ఏండ్లలోపే ఉండటం విశేషం. అందరూ తొలిసారి ఎన్నికైన వాళ్లే. గ్రామ సర్పంచ్ 38 ఏండ్ల జస్వీందర్ సింగ్ వృత్తి రీత్యా వడ్రంగి. గత డిసెంబర్ 22న జరిగిన అక్రి గ్రామ పంచాయతీ సమావేశంలో సివిల్ సర్వీసులకు ప్రిపేర్ అయ్యేవాళ్లు, మెడిసిన్, ఇంజినీరింగ్, సైన్యంలో చేరాలనుకునే వాళ్ల శిక్షణకు ఆర్థికంగా అండగా నిలవాలనే నిర్ణయం తీసుకున్నారు. 'అవసరమైన వారికి ఒక్కసారి ఆర్థికంగా మద్దతుగా నిలిస్తే వాళ్లు జీవితంలో నిలదొక్కుకుంటారు. మళ్లీ మా గ్రామ ప్రజలకు తిరిగి సహాయం చేస్తారు. పైగా వారి విజయాలు యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి' అంటాడు జస్వీందర్ సింగ్. అంతేకాదు ఇంతకు ముందు ఈ గ్రామ అమ్మాయిలు శిక్షణ కేంద్రాలకు వెళ్లాలంటే కొంచెం ఆలోచించేవాళ్లు. తాజా నిర్ణయం వారికి ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. అబ్బాయిల్లాగే తాము కూడా పెద్ద పెద్ద పరీక్షలు రాస్తామనే ధీమా ఇచ్చింది. అక్రి గ్రామ పంచాయతి తీర్మానం ఒక్క చదువులకు మాత్రమే పరిమితం కాలేదు, వివిధ స్థాయుల ఆటలపోటీల్లో పాల్గొనాలనుకునే వాళ్లకు కూడా అండగా నిలవాలని నిర్ణయించారు. తమ గ్రామ యువత మత్తుమందు వ్యసనానికి వ్యతిరేకంగా పోరాడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామంలో పేద కుటుంబాల ఆడపిల్లలకు పెండ్లి సమయంలో పంచాయతి తరఫున రూ.21,000 ఆర్థిక సహాయం చేయాలని కూడా నిర్ణయించారు. నిజమే గ్రామ పంచాయతీలు అంటే అభివృద్ధి మాత్రమే కాదు.. మానవాభివృద్ధి కూడా! అక్రి గ్రామ పంచాయతీ స్ఫూర్తిని భారతదేశంలోని మిగిలిన పల్లెలూ అందిపుచ్చుకోవాలి.

## వైతాళికుల వాణి

మానవ అభివృద్ధిపై పెట్టుబడి పెట్టకుండా సాధించే ఆర్థిక వృద్ధి సుస్థిరమైనది కాదు. పైగా అనైతికమైనది కూడా.

• **అమర్త్య సేన్**

(సుప్రసిద్ధ ఆర్థికవేత్త)

## క్యా సీన్ హై!

